క్లుప్తంగా

### 27న బ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం



ఆరాధనోత్సవాల ప్రచార పత్రాన్ని ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి, కమిటీసభ్యులు

పామూరు: మండలంలోని ప్రముఖక్షేత్రం అనుమునిగిరి శివరామ బ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం ఈ నెల 27వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్లు క్షేత్ర పీఠాధిపతి రామడుగు శివరామ దీక్షితులు, విశ్వబ్రాహ్మణసంఘం మండల అధ్యక్షుడు నొస్సం నాగేంద్రాచారి తెలిపారు. ఈసందర్భంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఆరాధనోత్సవాల ప్రచార పత్రాన్ని కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఆరాధనోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

### ఐదుగురు జూదరుల అరెస్టు

పామూరు: స్థానిక నెల్లూరురోడ్డులోని లాడ్జిలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం సీఐ ఎం. భీమానాయక్, సిబ్బంది దాడులు నిర్వహించారు. దాడుల్లో ఐదుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.8,920 నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ వెంట ఏఎస్సై ముల్లా మహ్మద్, సిబ్బంది ఉన్నారు.

### మండపాలకు అనుమతి తీసుకోవాలి

టంగుటూరు: వినాయక చవితి పండుగ సందర్భంగా ఈ నెల 7వ తేదీ నుంచి నిర్వహించే మండపాలకు పోలీసు స్టేషన్లో అనుమతి తీసుకొవాలని సింగరాయకొండ సీఐ చావా హజరత్తయ్య సూచించారు. స్థానిక పోలీసు స్టేషను ఆదివారం సందర్శించి వినాయక చవితి మండలపాలపై, సిబ్బంది సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ వినాయకుడి విగ్రహం ఏర్పాటుకు కమిటీ సభ్యులు స్థల యజమాని, పంచాయతీ, విద్యుత్ శాఖ, ఫైర్ స్టేషన్ అధికారి అనుమతితో కూడిన లెటర్లు జతపరచాలన్నారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటను జరగకుండా చూడాల్సిన బాధ్యత విగ్రహ కమిటీలదేనన్నారు. ఎస్సై నాగమల్లీశ్వరరావు పాల్గొన్నారు.

### అమ్మో.. నడిచేదెలా?

● అధ్వానంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిసర ప్రాంతాలు



మర్లపాడు ప్రభుత్వ హై స్కూల్ ఎదురు బురదమయంగా మారిన దృశ్యం

టంగుటూరు: మండలంలోని మర్లపాడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిసర ప్రాంతాలు, పక్కన రహదారి అధ్వానంగా మారాయి. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు హై స్కూల్ ముఖ ద్వారం ఎదురుగా ఉన్న ప్రాంతం పూర్తిగా వర్షపు నీటితో బురదమయం అయింది. విద్యార్థులు పాఠశాల లోపలికి వెళ్లాలంటే అలానే వెళ్లాలి. దీనివల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షానికి హైస్కూలు ముఖ ద్వార ప్రాంతమంతా జలమయమై దోమలకు నిలయంగా మారింది. మలేరియా, టైఫాయిడ్, డెంగీ సంభవిస్తున్న ఈ సమయంలో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. గ్రామంలోని హోటల్ యజమానులు చెత్తాచెదారం తీసుకొచ్చి హైస్కూల్ పరిసర ప్రాంతంలోనే వేస్తున్నాడని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు దీనిపై దృష్టి సారించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కొండపిలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్

కొండపి (టంగుటూరు): అల్పపీడనంతో కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొండపి మండల ప్రత్యేక అధికారి, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులకు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనకర్లపూడి గ్రామ సమీపంలో ఉన్న మూసి, అట్లేరు వాగులను పరిశీలించి అధికారులకు సూచనలు జారీ చేశారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలించి భోజన తదితర సదుపాయాలపై ఆరా తీశారు. తహసీల్దార్ మురళి, ఎస్సై కృష్ణబాజీబాబు, మండల అధికారులు పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దు చేయాలని ధర్నా



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు




మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

కనిగిరి రూరల్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన, ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్కే నాయబ్ రసూల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా చేపడుతున్న యూపీఎస్ విధానాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. సెప్టెంబర్ 1వ తేది ఉద్యోగస్తులందరికి చీకటి రోజని, అందుకే ఒకటో తేదీని సీపీఎస్ వ్యతిరేక దినోత్సవంగా పాటిస్తున్నట్లు తెలిపారు. ఏపీటీఎఫ్ అధ్యక్షుడు హజరత్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పద్ధతిని అమలు చేయాలన్నారు. ఒంగోలు వెంకటేశ్వర్లు, నాయకులు దండే శ్రీనివాసులు, సీహెచ్ సునీతాదేవి, ఏ సంజీవిరాణి, ఏ మాధవి, పి.అరుణ, ఎస్కే రెహాన్, సయ్యద్ రుక్సానా, కడలి సుజాత తదితరులు పాల్గొన్నారు.

**సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందే**

కందుకూరు: కాంట్రిబ్యూషన్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాల్సిందేనని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కళ్లగుంట మోహన్‌రావు డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీటీఏ, సీపీఎస్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల పట్ల సీపీఎస్ ఒక భూతం లాగా ఉందని, 30 ఏళ్ల పైబడి ఉద్యోగాలు చేసిన ఉద్యోగులకు కనీసం గౌరవంగా పెన్షన్ తీసుకునే పరిస్థితి లేకపోవడం అన్యాయమన్నారు. వెంటనే ప్రభుత్వం చొరవ తీసుకుని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. బీటీఏ నాయకులు షేక్ అబ్దుల్లా, సంగా మహేంద్ర, ధన్యాసి కోటేశ్వరరావు, అశోక్‌కుమార్, కోటయ్య, అంజయ్య, వలేటి మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ వర్ధంతి ఘనంగా నిర్వహించాలి

సింగరాయకొండ: వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించాలని మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పిలుపునిచ్చారు. కార్యాలయంలో సోమవారం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, అనంతరం మండల కేంద్రంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొని తరువాత జరుగుమల్లి, కొండపి, చివరగా పొన్నలూరు మండలంలో జరిగే వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కనిగిరి రూరల్: దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి వేడుకలను సోమవారం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో, గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పట్టణంలో స్థానిక చెక్ పోస్టు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి సోమవారం ఉదయం 10.30 గంటలకు నివాళులర్పిస్తామన్నారు. పేద మహిళలకు చీరల పంపిణీ, అన్నదానం చేస్తామన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ ప్రజాప్రతినిధులు, ఎంపీపీ, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, అందరు తప్పక పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పామూరు: మహానేత వైఎస్సార్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, బూత్‌కమిటీ మండల అధ్యక్షుడు గట్లా విజయభాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఉదయం 9 గంటలకు వైఎస్సాఆర్ విగ్రహానికి పూలమాలవేసి అనంతరం వైద్యశాలల్లో పండ్లు, రొట్టెల పంపిణీ, అనంతరం పార్టీ కార్యాలయంలో సభ ఉంటుందన్నారు. నాయకులు, ప్రజాప్రతినిదులు, అన్ని విభాగాల అధ్యక్షులు హాజరు కావాలని కోరారు.

లింగసముద్రం: మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిచ్చపాటి తిరపతిరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఉలవపాడు: వైఎస్సార్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని పట్టణ కన్వీనర్ కృష్ణారెడ్డి తెలిపారు. ఉలవపాడులోని వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, మండల కన్వీనర్ పోతురాజు, జేసీఎస్ కన్వీనర్ ధనకోటేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. మండల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

హనుమంతునిపాడు: వైఎస్సార్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ప్రజాప్రతినిధులు, నేతలు హాజరు కావాలని కోరారు.

## గ్రంథాలయ సభ్యత్వం తీసుకోండి



ఉలవపాడులో చదవడం మాకిష్టం కార్యక్రమం



పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

టంగుటూరు: గ్రంథాలయ సభ్యత్వం తీసుకుని విద్యార్థులు చదువుకోవాలని గ్రంథపాలకుడు వర్ధనరాజు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో కాలేజీ విద్యార్థులు అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామస్తులు, పాఠకులు పాల్గొన్నారు.

**విద్యార్థులు ఇష్టంగా చదవాలి**

ఉలవపాడు: విద్యార్థులు పుస్తకాలను ఇష్టంగా చదవాలని గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయం, చాకిచర్ల బుక్ సెంటర్‌లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి ఇక్కడ పుస్తకాలను ఉపయోగించుకుని చదివి మంచి విజ్ఞానం పొందాలని సూచించారు. ఇక్కడ ఉన్న విలువైన పుస్తకాలు ఎక్కడా దొరకవని, వాటిని చదివి విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు.

## టంగుటూరు వాసికి అంతర్జాతీయ పురస్కారం



వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు అందుకుంటున్న రెవరెండ్ డాక్టర్ సుదర్శన్ బాబు

టంగుటూరు: మండల కేంద్రం గ్రామ నివాసి, న్యూలైఫ్ హోలీ మినిస్ట్రీస్ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ సుదర్శన్‌బాబుకు అంతర్జాతీయ పురస్కారం లభించింది. ఆయన సామాజిక క్రైస్తవ అధ్యాత్మిక సేవలను గుర్తిస్తూ ప్రఖ్యాత అంతర్జాతీయ సంస్థ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ వారు సర్టిఫికెట్ ఆఫ్ కమిట్మెంట్ అవార్డుకు ఎంపిక చేశారు. టంగుటూరు వెంకటాయపాలెం రోడ్డు లోని న్యూలైఫ్ పరిశుద్ధ ఆరాధన మందిరంలో ఆదివారం ఏర్పాటు చేసిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సౌత్ రీజియన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఉల్లాజి ఎలియాజర్ ఈ అవార్డుని బహూకరించారు. సుదర్శన్‌బాబు మాట్లాడుతూ సమాజమే వేదికగా సేవాపరిచర్యలు చేయడానికి క్రీస్తు బోధనలు ఆదర్శమని తెలిపారు. తన తండ్రి పాస్టర్ యస్. ప్రభుదాసు కూడా తనకు స్ఫూర్తి అని.. కుటుంబ సభ్యులకు, సంఘ సభ్యులకు, స్థానిక సమాజానికి కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ పాస్టర్ సలగాని ఎస్తేర్ ప్రభుదాసు, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు, న్యూలైఫ్ హోలీ మినిస్ట్రీస్ ఆఫ్ ఇండియా బోర్డ్ సభ్యులు, సంఘ సభ్యులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## జాతీయ నంది పురస్కారానికి ఎంపికైన బొల్లినేని

● జాతీయ నంది పురస్కారానికి బొల్లినేని ఎంపిక



బొల్లినేని భద్రయ్య

మద్దిపాడు: ప్రకాశం రావెళ్లవారిపాలెం గ్రామానికి చెందిన బొల్లినేని భద్రయ్య కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ జాతీయ స్వచ్ఛంద సేవ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ నంది పురస్కారానికి ఎంపికైనట్లు ఆ సంస్థ జాతీయ చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ ఆదివారం తెలిపారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామ్మూర్తి జయంతి పుస్కరించుకుని సెప్టెంబరు 15న విజయవాడలోని బాలోత్సవ భవనంలో ఈ పురస్కారాన్ని అందజేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యా, సామాజిక సేవారంగాలల్లో విశిష్ట సేవలందించిన బొల్లినేని భద్రయ్యకు జాతీయ స్థాయిలో నంది పురస్కారానికి ఎంపికయ్యారన్నారు. వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేయడం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేయడం, టాలెంట్ టెస్టులు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేయడం, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న 230 మంది విద్యార్థులకు తాగునీటి వసతి కల్పించడం, ఉచిత విద్యాబోధన తదితర సేవా రంగాల్లో బొల్లినేని సేవలందించారని తెలిపారు.

## రూ. 20 వేల సాగు సాయం అందించాలి



సింగరాయకొండ: రైతు సంఘం జెండా ఎగురవేసిన దృశ్యం

సింగరాయకొండ: టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ప్రతి రైతుకు ఎకరాకు 20 వేల రూపాయల సాగు సాయం అందించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కొర్కెల దినోత్సవంలో భాగంగా ఆదివారం కలికవాయలో మాట్లాడారు. ప్రభుత్వ విధానాల కారణంగా రాష్ట్రంలో ప్రతి రైతు 2.45 లక్షల రుణ భారంతో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో రైతు ఆత్మహత్యల్లో రాష్ట్రం 3వ స్థానంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 50 సంవత్సరాలు దాటిన ప్రతి రైతుకు కౌలు రైతుతో సహా ప్రతి ఒక్కరికీ నెలకు 10 వేల రూపాయల పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. రైతు తాను పండించిన పంటను కనీస మద్దతు ధరకు అమ్ముకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందించాలని కోరారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను 90 శాతం సబ్సిడీతో అందించాలని డిమాండ్ చేశారు. భూ యజమానికి సంబంధం లేకుండా కౌలు రైతుకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని సూచించారు. సహకార రంగంలో పాల కేంద్రాలను, ఒంగోలు డెయిరీని ప్రారంభించి పాడి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో నీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలన్నారు. రైతు సంఘ నాయకులు కాట్రగడ్డ నరసింహారావు రైతు సంఘం జెండాను ఎగురవేశారు. భాస్కర్, కోటిరెడ్డి, యలమంద రెడ్డి, మాలకొండారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఆస్తి కోసం సామగ్రి బయటపడేశారు..



బయట పడేసిన సునీత ఇంట్లోని సామగ్రి

● ముగ్గురు ఆడపిల్లలతో రోడ్డునపడిన మహిళ
● పోలీసులను ఆశ్రయించినా దక్కని ఫలితం

గుడ్లూరు (కందుకూరు రూరల్): ఆస్తి కోసం సొంత తోబుట్టువు కుటుంబాన్ని బయటకు నెట్టేసి సామగ్రి బయటపడేశారు. ఈ ఘటన గుడ్లూరు మండలంలోని చేవూరులో జరిగింది. వివరాల్లోకి వెళితే.. గుడ్లూరు మండలంలోని చేవూరు గ్రామానికి చెందిన ఏసోబు–మరియమ్మలకు ఆరుగురు కుమార్తెలు. ఆరో కుమార్తె సునీతను అదే గ్రామానికి చెందిన యేషియాకు ఇచ్చి వివాహం చేశారు. ముగ్గురు ఆడ పిల్లలు పుట్టిన తర్వాత భర్త మరణించాడు. దీంతో సునీత తల్లిదండ్రుల వద్దే ఉంటుంది. వీరికి మగ సంతానం లేకపోవడంతో వీరి తల్లిదండ్రుల కర్మకాండల కార్యం చిన్నాన్న కొడుకులు చేశారు. అయితే ఏసోబు చనిపోయే ముందు కర్మకాండలు చేస్తే ఆస్తి ఇస్తానని చెప్పారని చిన్నాన్న కొడుకుల వాదన. దీంతో ఆ ఇంటిని ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం ఇంట్లోకి చొరబడి ఇంట్లో సామగ్రి మొత్తాన్ని చిన్నమ్మ నాగేసమ్మ, ఆమె కుమారుడు జేమ్స్, కోడలు జయమ్మ, దేవసేన వచ్చి ఆరుబయట చెల్లాచెదురుగా పడేశారు. అడ్డుకోబోయిన సునీతను నెట్టిపడేశారు. స్థానికులు కూడా పట్టించుకోకపోవడంతో సునీత పోలీసులను ఆశ్రయించింది. అయితే కేసు నమోదు చేసిన పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీనిపై సీఐ మంగారావు మాట్లాడుతూ సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువర్గాలను పిలిపించి మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

## వివాహ వేడుకల్లో దద్దాల



వివాహ వేడుకల్లో దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఆదివారం వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. మండలంలోని భూతం వారిపల్లిలో జరిగిన మాసిపోగు ప్రభాకర్, భూషణమ్మ కుమారుడు సాల్మన్ వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ మల్లెల యాకోబు, మాసిపోగు సునీల్, బెన్నీ, నాని, కొండయ్య, గురుజాల సేతు పాల్గొన్నారు.

## వైభవంగా గోపూజ, మహానివేదన



మహానివేదన ప్రదక్షిణోత్సవంలో భక్తులు



మహానివేదన ప్రదక్షిణోత్సవంలో భక్తులు
గోపూజలో పాల్గొన్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయంలో మహానివేదన, గోపూజ, అభిషేకోత్సవం ఆదివారం అర్చకులు మంకాల సత్యనారాయణ, శివప్రసాద్ శర్మ వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ముందుగా నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తివారి ఉత్సవమూర్తులకు అభిషేకం, ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకోగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, ముడుమాల నారాయణరెడ్డి, సీహెచ్.సుబ్బయ్య, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కమిషనర్‌గా జోసఫ్ బాధ్యతల స్వీకరణ

● ఉసూరుమంటూ వెళ్లిపోయిన పాత కమిషనర్ రంగారావు



బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ డానియల్ జోసఫ్

కనిగిరి రూరల్: కనిగిరి మున్సిపల్ కమిషనర్‌గా డానియల్ జోసఫ్ ఆదివారం ఉదయం 9 గంటలకు బాధ్యతలు స్వీకరించారు. గురువారమే బదిలీ ఉత్తర్వులు వచ్చినా లెక్కలు సరిదిద్దుకునేందుకు మూడు రోజులు సమయం అడిగి.. కొత్త కమిషనర్ జాయిన్ కాకుండా ఆపేందుకు పాత కమిషనర్ చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. దీంతో పాత కమిషనర్ రంగారావు ఉసూరుమంటూ రిలీవ్ అయ్యారు.

**ఆ పనులకు ఆడిట్..?**

మున్సిపాలిటీలో ఇటీవల జరిగిన పనుల్లో పలు అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. పూడికతీత పనులు, బ్లీచింగ్, సున్నం కొనుగోలు, ఫాగింగ్ వంటి పనుల్లో అక్రమాలు జరిగాయని, వీటిని ఆడిట్‌కు పంపించాలన్న ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిసింది. కనిగిరిలో పూడికతీత పనులకు సంతనూతలపాడు, విజయవాడ నుంచి పొక్లెయిన్ తెప్పించి నామినేషన్ పద్ధతిలో పనులు చేయించారు. అందుకు కాంట్రాక్టర్ భారీ నజరానా ముట్టజెప్పినట్లు ప్రచారం సాగుతోంది.

## 6న ప్రతిభా పురస్కారాల అందజేత

కనిగిరి రూరల్: పేద నాయి బ్రాహ్మణ విద్యార్థులకు ఈ నెల 6న ఒంగోలులోని కాపు కల్యాణ మండపంలో ప్రతిభా పురస్కారాల పంపిణీ చేయనున్నట్లు సంఘ నాయకులు చింతలపూడి వెంకటేశ్వర్లు, పెరుగుపల్లి పూర్ణ చంద్ర రావు, చింతలపూడి వాసు, చెరుకూరి కాశయ్య తెలిపారు. ఈమేరకు స్థానిక కార్యాలయంలో నాయి బ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం, నాయి బ్రాహ్మణ సేవా సంఘ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. చింతలపూడి కరుణా సాగర్, తిరుపాలు, కొత్తపల్లి సత్యం, యోగి రాములు తదితరులు పాల్గొన్నారు.